


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం 14 మార్చి 2025 6 పేజీలు




# హెూలీ.. ఆనందాల కేళీ..!!



## - నేడు రంగుల పండుగ..
## - మరక లేకుండా జీవిద్దాం..
## - జాగ్రత్తలతో వేడుక జరుపుకోవాలని సూచన

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

పండుగ ఏదైనా దానికి ఒక ప్రత్యేకత ఉంది. ఒకటి రైతులదైతే మరొకటి బంధాలను తెలిపేది. అలాగే హెూలీ సామాజిక పండుగ. దీని కి పూజలు, పునస్కారాలు లేవు. పిండి వంటల ముచ్చట అసలే



లేదు. గుప్పెడు రంగును చేతిలో పట్టుకొని, ఆత్మీయులు, సన్నిహితులు, స్నేహితులపై చల్లుతూ గుండెల్లో ఉండే భావాలను, సంతోషాన్ని వ్యక్తం చేసే వేడుక. అయితే సింథటిక్ రసాయనాలను రంగులుగా ఉపయోగిస్తే కళ్లకు, శరీరానికి ప్రమాదమని వైద్యులు అంటున్నారు. తగిన జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు. వసంతకాలంలో వచ్చే హెూలీ పండుగ ప్రకృతి మార్పునకు చిహ్నం చెట్ల ఆకులు రాలిపోయి చిగురించే కాలం ఇది మోడు బారిన ప్రకృతి రంగుల పూలతో శోభాయమానంగా సింగారించుకొని వసంతున్ని స్వాగతిస్తుంది..హెూలీ అంటేనే రంగుల పండుగ కుల, మత, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా సమానత్వాన్ని చాటే పండుగే హెూలీ పండుగ. పూర్వం ఈ పండుగను వసంత కామ మహెూత్సవము అని పిలిచేవారు మనసులో దురహంకారాన్ని కాముడీ రూపంలో దగ్ధం చేసే పండుగగా.. ప్రకృతి మనిషికి మంచి నేస్తాన్ని చూపే వర్ణ చిత్రంగా హెూలీ పండుగను జరుపుకుంటారు. ఈ పండుగను ప్రతి ఏడాది పాల్గున శుద్ధ పౌర్ణమి రోజు జరుపుకుంటారు. ఈ రోజు ఊరువాడ, పిల్లా పెద్ద ఆనందోత్సవాల కేరింతల మధ్య రంగుల చల్లుకుంటూ మునిగితేలుతారు. పండుగ ఏదైనా దానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఒకటి రైతులదైతే మరొకటి బంధాలను తెలిపేది. అలాగే హెూలీ సామాజిక పండుగ దీనికి పూజలు పురస్కారాలు లేవు పిండివంటల ముచ్చట అసలే లేదు గుప్పెడు రంగును చేతిలో పట్టుకొని ఆత్మీయులు సన్నిహితులు స్నేహితులపై చల్లుతూ, పూస్తూ గుండెల్లో ఉండే భావాలను సంతోషాన్ని వ్యక్తం చేసే వేడుక హెూలీ పండుగ. హెూలీ వేడుకలకు తెలుగు ప్రజలు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారు కలెక్టర్..అయిన బంట్రోతైన.. రంగులు చల్లుకొని అభినందనలు తెలుపుకుంటారు అదే హెూలీ ప్రత్యేకత.

2లో

### మహిళలు ఆత్మవిశ్వాసంతో

# ముందుకు సాగాలి

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
## - టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరని అన్నారు. ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని, అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం (మిగతా 2లో)




### గ్రామీణ ప్రాంత నియోజక వర్గాలలో

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

## - రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు



సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. చర్చించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే సమర్పించాలని (మిగతా 2లో)

# హెూలీ.. ఆనందాల కేళీ..!!

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

**హెూలీ వెనుక పురాతన గాథ.**

రాక్షస రాజైన హిరణ్యకశపుడు బ్రహ్మ వరముతో విష్ణుమూర్తి మీద కోపముతో హద్దులు మరచి దేవతలను, మునులను అనేక రకాలుగా హింసించేవాడు. దీంతో విష్ణుమూర్తి ప్రభావముతో హిరణ్యకశుపునికి ప్రహ్లాదుడు జన్మిస్తాడు. అనుక్షణం హిరణ్య కశిపుని శత్రువైన విష్ణుమూర్తిని ధ్యానించేవాడు ఇది ఇష్టం లేని హిరణ్య కశపుడు అనేక రకాలుగా ప్రహ్లాదుని చంపాలని ప్రయత్నించి విఫలమవుతాడు. మరో ప్రయత్నంగా తన చెల్లెలైనా హెూలీకను ప్రహ్లాదున్ని చంపడానికి పంపుతాడు. ప్రహ్లాదుడు తనను రక్షించమని విష్ణుమూర్తిని వేడుకోగా విష్ణువు ప్రభావంతో హెూలిక మరణిస్తుంది. హెూలిక మరణించినందుకు గుర్తుగా ఆనందోత్సవాలతో హెూలీ జరుపుకుంటారని పురాణ గాథల్లో ప్రచారంలో ఉంది.

**సహజరంగులే శ్రేయస్కరం.**

ఈ సీజన్లో మోదుగు పూలు విరివిగా పూస్తాయి ఆ పూలను సేకరించి వేడి నీటిలో ఉడకపెట్టి వడకడ తారు ఇలా.. వచ్చిన ఎరుపు కాషాయ రంగు నీళ్లను చిన్న పెద్ద అనే లేకుండా చల్లుకుంటే ప్రమాదం ఏమి ఉండదు. ప్రకృతి నుంచి లభించే ఆకులు, పూరెక్కలతో తయారుచేసిన రంగులతో హెూలీ జరుపుకుంటే చర్మం మృదువుగా ఉంటుంది. రుతువుల మార్పిడి కారణంగా బ్యాక్టీరియా వైరస్ లను అదుపులో పెట్టేందుకు పసుపు రంగు ఎంతగానో ఉపయోగపడుతుంది. హెూలీ రోజు కోపతాపాలకు తావు లేకుండా క్షమాగుణముతో అందరు వ్యవహరించడమే ప్రత్యేకత. ప్రకృతి నుండి వచ్చే సహజ సిద్ధమైన రంగు వాడటం ఎంతో మేలని పర్యావరణ ప్రేమికులు వైద్యులు సూచిస్తున్నారు. డాక్టర్లు రంగులను కంట్లపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతూనే ఉన్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు.**

హెూలీ వేడుకల్లో రంగులు కళ్ళకు హాని కలిగించకుండా రక్షణ కవచాలు, అద్దాలు, మాస్కులు ధరించడం శ్రేయస్కరం. కళ్ళల్లో రంగు పడి మంట రావడం, నీరు రావడం, కళ్ళు ఎరుపెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి. రసాయనాలతో శరీరానికి ఏదైనా ప్రమాదం సంభవిస్తే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. ముందుగా తలకు శరీరానికి నూనె రాసుకుంటే శుభ్రం చేసేటప్పుడు రంగులు సులభంగా తొలగిపోతాయి. గోరువెచ్చని నీటితో శరీరంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడం మంచిది. రంగులు చల్లుకున్నాక స్నానానికి వెళ్లి చెరువులోని నీటి కాలుష్యానికి కారకులు కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంతవరకు రంగులు కొనుగోలు చేసే టప్పుడు వాటి వివరాలను అడిగి తెలుసుకుని సాధ్యమైనంతవరకు నాణ్యమైన రంగులు కొనుగోలు చేయండి.

## రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాల గురించి చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని గురువారం రోజున వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ అన్నారు. జిల్లా కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలతో గురువారం హైదరాబాద్ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించే కలెక్టర్లతో పాటు ఈ.ఆర్.ఓలు తమతమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్ లు ఏర్పాటు చేసి అప్ డేట్స్ అందించాలన్నారు. సమావేశాల తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సమావేశాల వివరాలను సీఈఓ కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు కూడా పంపించాలని సూచించారు. కాగా, ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సీ.ఈ.ఓ



సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సిఈఓ ఆదేశించిన మేరకు సమావేశం వివరాలు, మినిట్స్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తూ, సిఈఓ కార్యాలయానికి సమర్పిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, డి.శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ, నాయాబ్ తహసీల్దార్ అనీల్, తదితరులు పాల్గొన్నారు.

## బోదకాల నివారణ పై సమావేశం

**సూర్య- నవీపేట్:**

బోదకాలు వ్యాధి నివారణకు ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ వైద్య అధికారిని డాక్టర్ శిఖర అన్నారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ. మండల వ్యాప్తంగా 37 ఫైలేరియా కేసులు ఉండగా అందులో 30 వరకు మండల కేంద్రంతో పాటు మిగతావి వివిధ గ్రామాల్లో ఉన్నాయని తెలిపారు. వీటిపై ఈనెల 24 నుంచి 27 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలలో రాత్రి సమయమున రక్త నమూనాలు సేకరించబడతాయి కాబట్టి దీనిపై గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి తో పాటు ఆశ వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది, ఐకెపి సభ్యుల సహకారంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని. ఇటుక బట్టీలు, కంకర మిషన్ వద్ద పనిచేసేవారు ఒక గంట నిద్ర పోయిన తర్వాత వారి యొక్క రక్త నమూనాల సేకరించి జిల్లా కేంద్ర ఆసుపత్రి కి పంపబడతాయన్నారు. నూతనంగా ఎలాంటి కేసులు నమోదు కాకపోతే బోదకాలు లేని జిల్లాగా నిజామాబాద్ ను ప్రకటిస్తారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీంద్ర నాయక్, వెంకటేశ్వరరావు, రాణి, పుష్ప, వినయ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌లి**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాల గురించి చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించే కలెక్టర్లతో పాటు ఈ.ఆర్.ఓలు తమతమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్ లు ఏర్పాటు చేసి అప్ డేట్స్ అందించాలన్నారు. సమావేశాల తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సమావేశాల వివరాలను సీఈఓ కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు కూడా పంపించాలని సూచించారు. కాగా, ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సీ.ఈ.ఓ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

(మొదటి పేజి తరువాయి)

పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చిందని, క్యాంటీన్ ల నిర్వహణ, యూనిఫాం లు కుట్టే బాధ్యతలను అప్పగించిందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, వివిధ రంగాలలో ప్రముఖంగా సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా పౌర సంబంధాల అధికారిణి నర్ర పద్మశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత నియోజక వర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

(మొదటి పేజి తరువాయి)

ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ నియోజక వర్గాల్లో ఐ.టీ. ఐ. ల ఏర్పాటుకు అవసరమైన రెండు ఎకరాల చొప్పున భూములను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో ఐ.టీ.ఐ. ఉన్నదని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఏం.కోటేశ్వర్లు, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు , తదితరులు పాల్గొన్నారు.

## పోచారం అభయారణ్యాన్ని సందర్శించిన విద్యార్థులు

**సూర్యలింగంపేట్**



లింగంపేట్ మండలంలోని ఒంటరిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం పోచారం అభయారణ్యాన్ని,పోచారం డ్యామ్ ను సందర్శించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజినీకాంత్ గౌడ్ తెలిపారు.అటవీ శాఖ వాహనంలో జింకల కేంద్రాన్ని సందర్శించి వన్యప్రాణులను ఆసక్తితో విద్యార్థులు గమనించి ఆనందించి సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఒక్కరోజు విహారయాత్రలో భాగంగా వన్యప్రాణుల సంరక్షణ నిర్వహణను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు.ఒక్కరోజు విహారయాత్రలో ఉపాధ్యాయురాలు కిరణ్మయి,విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

**సూర్య- ఐక్యనూర్**



విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడలలో రాణించాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన టిపిఎల్ క్రికెట్ లీగ్ పోటీల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో చైతన్యం తీసుకువచ్చేందుకు క్రీడా పోటీలు నిర్వహించిన ఆర్గనైజింగ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, విడిసి అధ్యక్షుడు సిద్దిరాములు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మయ్య క్రీడాకారులు పాల్గొన్నారు

## ఘనంగా కామ దహన (హెూలీ) వేడుకలు

**సూర్య రెంజల్**



మండల కేంద్రంతో పాటు దూపల్లి, సాటపూర్, కల్యాపూర్, కూనేపల్లి, నీలా,బోర్గాం, వీరన్న గుట్ట, గ్రామాలలో బుధవారం రాత్రి కామ దహన (హెూలీ) వేడుకలను నిర్వహించారు. గురువారం ఉదయం నుండి చిన్నారులు, యువకులు, మహిళలు, పెద్దలు రంగులతో హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. సాంప్రదాయ ఆచారాల మేరకు గ్రామాలలో మహాశివరాత్రి పురస్కరించుకున్న తర్వాత వచ్చే పౌర్ణమి సందర్భంగా హెూలీ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. హెూలీ వేడుకల్లో చిన్న- పెద్ద అనే తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ ప్రేమ అప్యాయతలను పంచుకుంటూ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, యువతి,యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# చిన్న,మధ్యతరహా పరిశ్రమల తోనే ఉపాధి

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే విజయ్ కుమార్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కామారెడ్డి, గురువారం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు- ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమలు బలపడినప్పుడే విద్యార్థులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. కిష్టయ్య మాట్లాడుతూ చిన్న,సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలా నిలుస్తున్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి సాయపడుతున్నాయని తెలిపారు. ప్రత్యేక అతిథి రిసోర్స్ పర్సన్ రాజేష్ కుమార్ యాదవ్, అదనపు సంచాలకులు, ఇండియన్



ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ సర్వీసెస్, హైదరాబాద్ ,సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల గురించి విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు.అర్థశాస్త్ర విభాగ పతి,వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ ఎస్. సుధాకర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ లు దేశ సామాజిక, ఆర్థిక వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ పి.పున్నయ్య, తెలంగాణ విశ్వవిద్యాలయం మాట్లాడుతూ ఆలోచన ఉంటే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఓలా,ఉబర్, ఓయో, సృష్టికర్తలు మన గ్రామీణ విద్యార్థులు అని మూలధనం లేకుండానే ఓనర్లు అయ్యారని తెలిపారు. వి.లాలు నాయక్ కామారెడ్డి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పట్టణ మరియు గ్రామీణ ఔత్సాహికులైన యువతి, యువకులకు వస్తు ఉత్పత్తి,సేవా రంగాలకు సంబంధించి స్వయం ఉపాధి పొందేటందుకు ప్రభుత్వాలు తక్కువ వడ్డీతో రుణాలు కలిపిస్తు న్నామని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తదుపరి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ముఖ్య అతిథులను మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ పి. విశ్వప్రసాద్, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఏ. జయప్రకాష్, అర్థశాస్త్ర ఆచార్యులు డాక్టర్ గణేష్, డాక్టర్ రాజ్ గంభీరావు, హిందీ అధ్యాపకులు డాక్టర్ జి. శ్రీనివాసరావు, డాక్టర్. చంద్రశేఖర్ గౌడ్, ఫర్వీన్ ఫాతిమా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయానికి భక్తుని భారీ విరాళం రూ. 5 లక్షలు అందజేసిన మాజీ ఎంపీపీ

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి, గతంలో మాట ఇచ్చిన ప్రకారం మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు గతంలో ఇచ్చిన మాట ప్రకారం అక్షరాల ఐదు లక్షల రూపాయల నగదు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కమిటీ సభ్యులు నర్సింగ్ రావుకి వేద పండితుల చేత ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, నర్సింగ్ రావు వెంట నరేందర్ రావు, బాల్ రాజ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రామ్మోహన్, మాజీ సర్పంచ్ మద్దెల రాజు, %సాఎ%ం డైరెక్టర్ కొత్త అరవింద్, మాజీ ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, సన్నీ గౌడ్, రాహుల్ గౌడ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కళ్ళజోళ్ళ పంపిణీ

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థు లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి శ్రీనాథ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేత్ర రక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకుకూరలు, పాలు, బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, డాక్టర్ సాధన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు

## హనుమాన్ స్వాములకు భజన సామాగ్రి వితరణ

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని కంచర్ల గ్రామంలో ఉన్న హనుమాన్ స్వాములు భజన చేసుకోవడానికి గ్రామానికి చెందిన ప్రముఖ మెజీషియన్ సంతోష్ గురువారం భజన సామాగ్రిని వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష పరులు తాము అడుగగానే భజన సామాగ్రిని ఇచ్చిన సంతోష్ ను అభినందించారు. ఈ కార్యక్రమలో గురుస్వామి శ్రీనివాస్, సాగర్,అరవింద్, మహేష్ ఎల్లం,దశరథ్ లు ఉన్నారు

## ఘనంగా కవిత జన్మదిన వేడుకలు...

**సూర్య- నవీపేట్:**



నాళేశ్వర్ గ్రామానికి చెందిన బినోల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మగ్గరి హన్మండ్లు తన అభిమాన నాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 500 మంది రోగులకు పండ్లు పంపిణీ చేసి తన వీర అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ముందుగా ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కేసీఆర్ మార్గదర్శకంలో కవితక్క ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం బతుకమ్మ పండుగ, మిలియన్ మార్చ్, నిరాహార దీక్షలు, సకల జనుల సమ్మె, రైలు రోకో, సడక్ బంద్ తదితర ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర వహించారని గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి ఏర్పాటు చేసి బతకమ్మ పండగను దేశవ్యాప్తంగా పరిచయం చేసిన ఘనత ఆమెకే దక్కుతుందని తెలిపారు. ఇలాంటి మా నాయకురాలు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కుమ్మరి కృష్ణ, రాజశేఖర్, వినోద్, రాజేష్, అజామ్, మనోహర్, లక్ష్మణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## పసుపు బోర్డు కార్యాలయం ఎక్కడ ఉంది - జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్

**సూర్య - మోపాల్,**




పసుపు బోర్డు ఆగ మేఘాల మీద ఎందుకు ప్రారంభించా రాని, బోర్డు కార్యాల యం ఎక్కడ ఉందని, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్పు గంగారెడ్డి ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశములో మాట్లాడారు. పసుపు రైతుల సంక్షేమం కొరకు బోర్డు ఏర్పాటు చేసామని చెబుతున్నప్పటికి అసలు బోర్డు కార్యాలయం ఎక్కడ ఉందొ తనకే తెలియదని, రైతులకు ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేసారు. పసుపు బోర్డు పాలక వర్గం విధి విధానాలు కూడ ఖరారు కాలేదని ముప్పు గంగారెడ్డి తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి జవహర్ నవోదయ కోసం జక్రాన్ పల్లి ని ప్రతి ప్రదిస్తే, ఎంపీ అరవింద్ జాతీయ రహదారికి 12కిలోమీటర్ల దూరం లో ఉన్న కలిగోట్ ను ప్రతిపాదించారని గుర్తు చేశారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుల చారి ఎమ్మెల్యే భూపాతి రెడ్డి పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడం తాగదని అన్నారు. ఆయన వాఖ్యలను తీవ్రంగా ఖండి స్తున్నట్లు చేప్పారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన హోలీ సంబరాలు...

**సూర్య బోధన్**



నిజామాబాద్ జిల్లా సాలూర మండలాల్లోని పలు గ్రామాలలో గురువారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువకులు, పెద్దలు, ప్రజా ప్రతినిధులు అనే తేడాలు లేకుండా రంగురంగుల కలర్లను పూసుకొని పండగ సంబరాలు జరుపుకున్నారు.ఒకరికి ఒకరు అలింగణం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బోధన్, సాలూరా మండలాలలోని గ్రామాల ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా హోలీ సంబరాలు

**సూర్య వేల్పూర్**



మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. హోలీ మొదటి రోజున గ్రామాల్లోని కామ దహనాన్ని నిర్వహించి మరుసటి రోజు గురువారం హోలీ సంబరాలను యువకులు పిల్లలు కేరింతలు కొడుతూ సంబరాల్లో మునిగితేలారు. గ్రామాల్లోని పిల్ల పెద్దలు తారతమ్యం లేకుండా అందరూ సంతోషంగా పండుగలు నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను ప్రజలు నిర్వహించారు.

## నేటి నుండి మార్కెట్ యార్డ్ కు మూడు రోజులు సెలవులు

**సూర్య - మోపాల్,**




నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ వరుస సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు. శుక్రవారం 14 హోలీ, 15న దల్వండి, 16న ఆదివారం, కావడంతో మార్కెట్ యార్డులో ఇలాంటి క్రాయ విక్రయలు జరగవన్నారు. దీనిని గమనించి రైతులు పంటను మార్కెట్ యార్డ్ కు తీసుకరావద్దనిసూసించారు. 17న సోమవారం, యధావిధిగా మార్కెట్ యార్డ్ లో క్రాయ విక్రయాలు కొనసాగుతాయని తెలిపారు.

## వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ప్రత్యేక అవగాహన కల్పించిన జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఫరీదా

**సూర్య కామారెడ్డి**



ఈరోజు కామారెడ్డి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం రోజున ప్రత్యేకఅవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మాట్లాడుతూ రోజు 4 నుండి 5 లీటర్ ల నీరు త్రాగాలి మరియు ఉప్పు చక్కెర రోజు తినే ఆహారంలో తగ్గించాలని నాలుగు నెలలకు ఒకసారి రక్త పరీక్ష చేయించుకోవాలని అనవసరంగా నొప్పుల గోలీలు గాని ఇతర చెట్ల మందులు గాని వాడకూడదని దావఖానా కు వచ్చి సంప్రదించాలని కోరారు ఇందులో భాగంగా కామారెడ్డి జనరల్ హాస్పిటల్లో నెలకి 900 నుండి 1000 మంది పేషంట్ సేవలు తీసుకోవడం జరుగుతుందని డాక్టర్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ డాక్టర్ ఫరీదా బేగం మరియు డాక్టర్ బన్సీలాల్ డాక్టర్ వెంకట్ ఆర్ ఎం ఓ యాదగిరి డాక్టర్ శరత్ నర్సింగ్ సూపర్ ఇండెంట్ స్వరూప రాణి డయాలసిస్ మేనేజర్ శ్రీనివాస్ మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

**సూర్య- బిక్కనూర్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో విద్యారంగానికి 15% నిధులను కేటాయించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వేలకోట్ల రూపాయలు విద్యార్థులకు బకాయి ఉన్నారని, స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని, కళాశాలలో, యూనివర్సిటీలలో అధ్యాపకులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నియోజకవర్గ ఇంచార్జ్ సమీర్ ఖాన్ నాయకులున్నారు.

# మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు పై స్పెషల్ డ్రైవ్.

**- మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ పై హెల్ప్ డెస్క్ ప్రారంభం..**

**- బకాయిలు చెల్లించి మున్సిపల్అభివృద్ధికి సహకరించండి..! - మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్**

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మున్సిపల్ పట్టణ ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ మాట్లాడారు ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణంలో మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు పూర్తి పటిష్ట కార్యాచరణ లో భాగంగా అమలు చేస్తున్నామని అన్నారు అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ను ప్రారంభించినట్లు తెలిపారు .ఎల్లారెడ్డి మున్సిపల్ పట్టణంలో12 వార్డులు ఉన్నాయి 12 వార్డులో ఉన్న ఇండ్ల సంఖ్య 4716,అని తెలిపారు ఆస్తి పన్ను మొత్తం1.35,40 పెండింగ్ బకాయిలు 72.40 పన్ను వసూలు 122,14 ఇప్పటివరకు వసులైనట్లు తెలిపారు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 907 వచ్చినట్లు అన్నారు పూర్తయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 665 అని అన్నారు ఎల్ఆర్ఎస్ లో ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన పేర్కొన్నారు, ఐదు లక్షల లోపు ఉన్న ఆస్తి పన్ను బకాయిలు వ్యాపార సంస్థలు, షాపింగ్ కాంప్లెక్స్, సినిమా హాలు, హోటల్లు, హాస్పిటల్స్ వంటివి పెండింగ్ ఉన్నట్లు తెలిపారు, మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు ఎల్ఆర్ఎస్ కౌంటర్ కు మున్సిపల్ కమిషనర్, మేనేజర్ వాసంతి, టౌన్ ప్లానర్ భూపతి తో పాటు ఐదుగురు టీం వర్క్ చేస్తుంటారని ఎల్ఆర్ఎస్ లో ఏమన్నా డౌట్స్



ఉంటే కౌంటర్ వద్ద వెళ్లి డౌట్స్ క్లారిఫై చేసుకోవాలని కోరారు, అత్యధికంగా ఇంటి పన్ను బకాయిలు ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ , సినిమా హాల్ లను సందర్శించి బకాయిలు చెల్లించాలని కోరారు మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు ,,ఇప్పటి వరకు ఎల్లారెడ్డి పట్టణంలో 80 శాతం ఇంటి పన్ను వసూలు అయింది. సెప్టెంబర్ 31 వరకు ఉన్న గడువులో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయడానికి పెట్టుకున్నట్లు.గడువు లోపల అందరూ ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలి, లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.ఈనెల 31 అందరూ ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని కోరారు, ఎవరైతే వెంటనే ఫీజు చెల్లించి రెగ్యులర్ చేసుకుంటారో వారికి సర్టిఫికెట్స్ జారీ చేయడం జరుగుతుందనీ అన్నారు ఎల్లారెడ్డి మున్సిపల్.పట్టణంలో మున్సిపల్ సిబ్బంది లక్ష్యాలను నిర్దేశించి ప్రతి ఒక్క దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తప్పనిసరిగా మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నమని తెలిపారు అధికారులు జాబితాలోలో ఎల్లారెడ్డి పట్టణంలో 46 మంది ఎల్ అర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఆమోదించబడింది, మిగిలిన వారిని కూడా ఫాలోఅప్ చేస్తూ మార్చి 31 లోగా ఫీజు చెల్లించేలా చూడాలని కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు.అత్యధిక బకాయిలు ఉన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారికి నోటీసులు జారీ చేయడం, జరుగుతుందని ఇంకా చెల్లించని వారి ఆస్తులను పురపాలక సంఘ చట్టం 2019 ప్రకారం సీజ్ చేయడం వంటి చర్యలు స్పష్టంగా తెలియజేసారు. అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని, అందరూ ఆస్తి పన్నులు , ఇతర మున్సిపల్ పన్నులను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.100 శాతం పన్ను వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు .అనంతరం అధికారులతో కలిసి పలు వార్డులను పరిశీలించారు. నిర్మాణ పనుల త్వరితగతిన పూర్తి చేయాల్సిన పనుల నిర్వహణను పర్యవేక్షిస్తూ. ఎల్లారెడ్డిపట్టణ శివారులో నూతనంగా నిర్మాణ పనులను సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు తెలిపారు, ప్రజలకు అనుగుణంగా ఉండే స్థలంలో నిర్మాణం చేపట్టాలని అధికారులకు. పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు మేనేజర్ వాసంతి, ప్రదీప్, అంజయ్య, ప్రశాంత్, సుజాత తదితర సిబ్బంది ఉన్నారు.

## జిల్లా ప్రజలు హోలీ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలి

**- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



హోలీ పండుగ-2025 సందర్భంగా ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించేందుకు జిల్లా ఎస్పి . రాజేష్ చంద్ర, పలు సూచనలతో హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు. 14-03-2025 నాడు 6:00 గంటల నుండి 12 గంటల వరకు హోలీ పండుగ జరుపుకోవాలిసురక్షితమైన రంగులను ఉపయోగించండి %-% హానికరమైన రసాయనాలున్న రంగులను వాడకండి.ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు మరియు వాహనాలపై రంగులు లేదా రంగు నీటిని విసరడం కఠినంగా నిషేధించబడింది.ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దు %-% నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడరాదు.ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం, శారీరక లేదా మానసిక వేధింపులకు గురిచేయడం తీవ్రంగా నేరంగా పరిగణించబడుతుంది.పబ్లిక్ రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం. మద్యం సేవించి వాహనం నడపకండి %-% మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం మరియు చట్టవిరుద్ధం. ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలను సమూహాలుగా తరలించడం, వీధుల్లో అవాంఛిత రీతిలో తిరగడంఅనుమతించబడదు.అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్లకు కాల్ చేయండి %-% ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి. శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రజలకు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించబడును.ప్రజలు హోలీ పండుగను అందరూ ఆనందంగా, సౌహార్దతను కాపాడుతూ, సురక్షితంగా హోలీ జరుపుకోవాలని కోరుకుంటున్నాము. పండుగ సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## మండల సమైక్య అధ్యక్షురాలిగా గడ్డం సులోచన

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండల సమైక్య అధ్యక్షురాలుగా గడ్డం సులోచన ను ఎన్నుకోవడం జరిగిందని ఐకెపి ఎపిఎం చామంతుల శ్రీనివాస్ తెలిపారు. గురువారం లింగంపేట్ మండల సమైక్య భవనంలో మండల సమైక్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించామన్నారు.అనంతరం మండల సమైక్య మహిళా నూతన బాడిని ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ నాగిరెడ్డి పేట్ ఐకెపి జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో మండల సమైక్య అధ్యక్షురాలుగా గడ్డం సులోచన మోతే, కార్యదర్శిగా భీమవ్వ పోల్కంపేట్, కోశాధికారిగా భాగ్యలక్ష్మి సజ్జనపల్లి,లను మండల సమైక్య జనరల్ బాడీ సమావేశంలో నూతన ఈసి సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బాడీ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో సీసీలు మన్సూర్, నజీర్,శ్రావణ్, స్వప్న,మేహేర్, అంజయ్య, గంగరాజు,రాజు రెడ్డి,అకౌంటెంట్ నరేందర్, అటెండర్ రవి,వివిధ గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సి యస్ సి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి లో హెల్త్ పరీక్షలు

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డిపేట కేంద్రంలోని స్థానిక బిందర్ లో గురువారం భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు అనంతరం. సి యస్ సి హెల్త్ కేర్ జిల్లా మేనేజర్ అంగోత్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ హెల్త్ చెక్ చేసుకోవాలని కోరారు. ఇందులో 52 రకాల పరీక్షలు కిడ్నీ, లీవర్, థైరాయిడ్, కాన్సర్, షుగర్ మొదలగు పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయన్న, మోషా, సాయిబాబా తెలంగాణ రాష్ట్ర సగర సంగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## రెండు లక్షల వరకు అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

**సూర్య, నాగిరెడ్డి పేట్**



మండలంలోని మాల్తుమ్మెద ప్రాథమికవేక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న అర్హత కలిగిన ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల లోపు రుణమాఫీ చేయాలని రైతులు మహాజనసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మాల్ తుమ్మెద సొసైటీ అధ్యక్షుడు దుండిగల్ల నర్సింలు ఆధ్వర్యంలో రైతులతో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ సందీప్ 1-04-2024 నుండి 10-03-2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను సభలు సభ్యులకు చదివి వినిపించారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి మూడు అంశాలపై తీర్మానం చేయడం జరిగిందని సొసైటీ అధ్యక్షులు దుండిగల్ల నర్సింలు తెలిపారు. రెండు లక్షల వరకు అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, మాల్తుమ్మెద గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం కోసం నూతన భవన నిర్మాణం, మాల్తుమ్మెద గేటు సమీపం వద్ద సహకార సంఘానికి కొనుగోలు చేసిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అలాగే సౌకర్యార్థం ధర్మకాంట ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు గుర్రాల సిద్దయ్య, కృష్ణవేణి రాజారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, నరేష్, మాజీ సొసైటీ చైర్మన్ రాంచంద్రా రెడ్డి, సొసైటీ సీఈవో సందీప్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## దూపల్లి లో కుస్తీ పోటీలు

**సూర్య రెంజల్**



మండలంలోని దూపల్లి గ్రామంలో హోలీ పర్వదినని పురస్కరించుకోని కుస్తీ పోటీలను నిర్వహించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంచుల బాబన్న తెలిపారు. గురువారం గ్రామంలో హోలీ పర్వదినాన్ని సందర్భంగా రంగులు చల్లుకుంటూ ప్రేమ, ఆప్యాయతలను పంచుకుంటూ, సంబరాలను జరుపుకున్నారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లయోధులకు కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలకు నిజాంబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర ప్రాంతాల నుండి మల్లయోధులు భారీ ఎత్తున పాల్గొన్నారు . కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్ల యోధులకు గెలుపొందిన వారికి నగదు బహుమతిని అందజేశారు. చివరి కుస్తీ పోటీ నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన మల్ల యోధుడు గెలుపొందడంతో ఆయనకు ?2,000 నగదును అందించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ నిర్వాకం తెలిపారు. ఈ కుస్తీ పోటీ నిర్వాణంలో మాజీ సర్పంచ్ శనిగరం సాయ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి కమిటీ సభ్యులు, నిర్వాకులు, గ్రామస్తులు మల్ల యోధులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు .. ...651 ఆబ్సెంట్...

**సూర్య ఇంధూర్:**

ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1 బీ, హిస్టరీ, జూవలజి పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొత్తం 651 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 18,197మంది విద్యార్థులకు గాను 17,546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 96.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 53 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దిన్ అస్లాం, కనకమహా లక్ష్మి, ముగ్గురు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు, హై పవర్ శ్రీనాథ్ కమిటీ, బల్క్ అధికారి బుద్ధిరాజ్ లు, కస్టోడియన్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని వెక్టార్ జూనియర్ కళాశాల, నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల రెండు పరీక్ష కేంద్రాలను, జూనియర్ కళాశాల, రెండు ఎస్ ఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను, అల్ఫోర్స్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. హై పవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 5 జూనియర్ కళాశాలలు,పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, రజీయుదిన్ అస్లాం, కనకమహాలక్ష్మి 16 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 16 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్కాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి బుద్ధిరాజ్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

# గణిత సామర్థ్యాలతో ఏఐ జత చేయడంతో అద్భుత ఫలితాలు

**- విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి యోగితా రాణా**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్ ఎల్ ఎన్ ) తో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ని జత చేయడం వల్ల అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి యోగితా రాణా పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, గుణాత్మక విద్య సమన్వయకర్తలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ఆమె మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఏఐ ఆధారిత ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశం తర్వాత కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 26 ప్రాథమిక



పాఠశాలలను ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఏ ఎక్స్ ఎల్ ల్యాబ్ లను ఈ నెల 15వ తేదీన ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలియజేశారు. ఎంపిక చేయబడిన ప్రతి ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఉన్నత పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ను ఉపయోగించుకొని ఒకక ఉపాధ్యాయుడికి బాధ్యత అప్పగించి విద్యార్థులకు ఏ ఐ ఆధారిత విద్యాబోధన చేయాలని సూచించారు. ఇందుకు కావలసిన మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకొని ఎంపిక చేయబడిన పాఠశాలల్లో కార్యక్రమం ప్రారంభించాలని ఆయన సూచించారు. హై స్పీడ్ ఇంటర్నెట్, విద్యార్థులకు హెడ్ ఫోన్స్ సమకూర్చుకుని ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని ఆయన ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, గుణాత్మక విద్య సమన్వయకర్త వేణుగోపాల్ పాల్గొన్నారు.

## హెూళీని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**- పండగ వేళ అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించం**

**నిజామాబాద్ సీపీ సాయి చైతన్య, ఐపీఎస్**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబసమేతంగా హెూళీ పండుగను జరుపుకోవాలని నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య, ఐపీఎస్ ప్రజలకు సూచించారు. హెూళీ సందర్భంగా ఆరోగ్యకరమైన సంప్రదాయ రంగులను వినియోగించాలని ఆయన అన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేడుక జరుపుకోవాలని చెప్పారు. ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు చల్లటం, రంగు నీళ్లను పోయడం సరికాదని అన్నారు. బహిరంగ ప్రాంతాల్లో ఇతరులను ఇబ్బందులు పెట్టడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, అల్లర్లకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. బైక్‌లతో ర్యాలీలు చేయడం, రహదారులపై ఇష్టం వచ్చినట్లు తిరగడం చేయవద్దని హితవు పలికారు. హెూళీ పండగ నాడు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణం కావొద్దని అన్నారు. మహిళల పట్ల గౌరవంగా నడుచుకోవాలన్నారు. కమిషనరేట్ పరిధిలో సీసీటీవీ కెమెరాల నిఘా ఉంటుందని చెప్పారు.

## బదిలీపై వెళ్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ నీ శాలువాతో సన్మానం చేసిన

**- వ్యాపారవేత్త సిద్ది శ్రీధర్ గుప్తా, మాజీ సర్పంచ్ గౌల పల్లి మల్లేష్..!**

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి పరిధిలో డీఎస్పీగా విధులు నిర్వహించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ గత 2 సంవత్సరాల 9 నెలల పాటు అత్యుత్తమ సేవలందించిన డీఎస్పీ డి. శ్రీనివాసులు బదిలీపై వెళ్లనున్న సందర్భంగా ఎల్లారెడ్డి డి.ఎస్.పి కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎల్లారెడ్డి వ్యాపారవేత్త సిద్ది శ్రీధర్, గుప్తా , వెంకటాపూర్ మాజీ సర్పంచ్ గౌల పల్లి మల్లేష్, అలాగే వై ఎల్ ఆర్ 9 గ్రూఫ్ ఆఫ్ చైర్మన్ కొయ్యల రాజా గౌడ్, శాలువాతో సన్మానించి పూల బోకెను అందించారు, అనంతరం వ్యాపార వేత్త సిద్ది శ్రీధర్ గుప్తా, మాజీ సర్పంచ్ గౌల పల్లి మల్లేష్ లు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఆయన చేసిన కృషి నీ కొనియాడారు, ఈ కార్య క్రమం లో యూత్ నాయకులు కరిచేవుల రాజు యాదవ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

**సూర్యభీమ్‌గల్ :**

విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే విద్యార్థిపై కట్టెతో కొట్టిన ఘటన భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలో చోటు చేసుకుంది.భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం పల్లికొండ గ్రామానికి చెందిన లోకాయి నవీన్ కుమార్ చిన్న కొడుకు లోకాయి రిషిక్(12) అదే గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 7వ,తరగతి చదువుతున్నాడు.రోజు మాదిరిగానే బుధవారం సుమారు ఉదయం 9గంటలకు స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో లోకాయి నవీన్ కుమార్ చిన్న కొడుకు లోకాయి రిషిక్ బుక్స్ కింద పడేశాడనే కారణంతో స్కూల్ ఉపాధ్యాయుడైన భూమేష్ లోకాయి రిషిక్ ను ఇష్టం వచ్చినట్టు కట్టెతో కొట్టడంతో గాయాలు అయ్యాయి.లోకాయి రిషిక్ తండ్రి లోకాయి నవీన్ కుమార్ ఉపాధ్యాయుడుపై ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## వెనుక నుంచి ఢీ కొట్టిన ఆటో. తీవ్ర గాయాలతో వృద్ధుడి మృతి..

**సూర్యఎల్లారెడ్డి**



వెనుక నుంచి ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఎల్లారెడ్డి మండలం సబ్దల్పూర్ గ్రామానికి చెందిన గడ్డం పోచయ్య 65 అనే వృద్ధుడు మృతి చెందాడు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హెూళీ పండుగ సందర్భంగా మటన్ తీసుకెళ్లేందుకు గ్రామం నుంచి ఎల్లారెడ్డికి వృద్ధుడు వచ్చాడు. మటన్ కొనుగోలు చేసుకుని తిరిగి గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. గాంధీ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై వెళ్తున్న పోచయ్యను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఆటో డ్రైవర్ ఆటోతో వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన పోచయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వాహనంలో హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుని అన్న కుమారుడు గడ్డం లచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## డిఎస్పి కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయాను జిల్లా ఎస్పి శ్రీ యం. రాజేష్ చంద్ర, బుదవారం సందర్శించారు. ఈ సందర్భంగా కామారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయంను, పరిసరాలతో పాటు, రికార్డ్ గదులను పరిశీలించి, సబ్ డివిజన్లో గల పోలీస్ స్టేషన్ లకు సంబందించిన అధికారుల మరియు సిబ్బంది వివరాలను ఏఎస్పి చైతన్య రెడ్డి ఐపిఎస్ గారిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పి గారి వెంట జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య గారు ఉన్నారు.

## జీవితంపై విరక్తి చెంది మహిళా మృతి

**సూర్యలింగంపేట్**



లింగంపేట్ మండలంలోని ముంబాజిపేట్ గ్రామానికి చెందిన పసులాది కాశవ్వ 53 అనే మహిళ భవానిపేట్ సింగాయ చెరువులో పడి మృతి చెందిందని లింగంపేట ఎస్సై వెంకట్రావ్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి ఈనెల 10 న హనుమాన్ మందిరంలో అన్నదాన కార్యక్రమంలో భోజనం చేసి బంధువుల గ్రామమైన గండిపేట్ గ్రామానికి వెళుతున్న అని చెప్పి వెళ్లిందన్నారు.తెల్లవారు జామున గండిపేట్ బంధువులకు కాశవ్వ కుమారుడు ఫోన్ చేసి అమ్మ వచ్చిందా అని అడగగా రాలేదని చెప్పగా,మిగతా బంధువులు ఫోన్ చేసి అడిగిన అక్కడికి రాలేదని చెప్పడంతో చుట్టుపక్కల వెతికిన ఆచూకి లభించలేదని అన్నారు. గురువారం ముంబాజిపేట్ గ్రామానికి చెందిన గుర్రపు కిష్టయ్య ఫోన్ చేసి మీ తల్లి కాశవ్వ భవానిపేట్ గ్రామ చెరువులో పడి చనిపోయిందని తెలిపారు. పసులాది కాశవ్వ గత కొద్ది రోజులుగా అట్టి కాలు నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మృతి చెందిందని మృతుని కుమారుడు కాశిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## పేకాట జోరుకు బ్రేక్ పడేది ఏనాడు

**సూర్య వేల్పూర్:**

మండలంలోని పడగల్ వేల్పూర్ తదితర గ్రామాలలో పేకాట స్థావరాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. పేకాట జోరుకు కుటుంబాలు విచ్చిన్నమై రోడ్డు పాలు అవుతున్నప్పటికీ దానిపై ఉన్న మోజుతో ఆట మాత్రం ఆపడం లేదు. అంతేకాకుండా మోతె పచ్చల నడుకుడా పడగల్ తదితర గ్రామాలలో పేకాట స్థావరాలను ఒక నలుగురు వ్యక్తులు కలిసి పేకాటరాయుళ్లను స్థావరానికి తీసుకువచ్చి పేకాట ఆడించడం అనేది సాంప్రదాయ బద్ధంగా మారింది. పేకాట స్థావరాలపై ఉక్కు పాదం మోపుతున్న పోలీసులు మరింత పకడ్బందీ తనిఖీలను నిర్వహించి పేకాట జోరుకు బ్రేక్ వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లక్షల్లో అప్పుచేసి పేకాటలో పెట్టి రోడ్డు నా పడ్డ కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నప్పటికిని పేకాటపై మమకారాన్ని చంపుకోకపోవడం విడ్డూరంగా ఉంది. మండలంలోని వ్యవసాయ క్షేత్రాలలో ఏర్పాటు చేసుకున్న ఫామ్ హౌస్ లో అడ్డాలో ఏర్పాటు చేసుకోవడం పరిపాటిగా మారింది. ఈ స్థావరాలపై నిఘా వేయని పోలీసులు కేవలం గ్రామ సరిహద్దుల్లో ఉన్న చిన్న చిన్న స్థావరాలను పట్టుకొని వారిని రిమాండ్ కు తరలిస్తున్నారు. పోలీసులు క్షేత్రస్థాయిలో కాకుండా ప్రత్యేకమైన దృష్టి సారించి స్థావరాలపై దాడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రోడ్డున పడుతున్న కుటుంబాలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు జిల్లాలోని గత ఎనిమిది నెలల నుండి పోలీస్ బాస్ లేకపోవడంతో విచ్చలవిడితనం ఎక్కువైందని పలు గ్రామాల్లో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ శాంతి భద్రత విషయంలోనూ పేకాట విషయంలోనూ మత్తు పదార్థాల సరఫరాలో తల వంచేది లేదని ఎంత పెద్ద వ్యక్తులైన తమ దృష్టికి వస్తే చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ సీరియస్ గా దృష్టి సారించి పేకాటను నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గుట్ట ప్రాంతంలో పుర్రె ఎముకలు లభ్యం

**సూర్య- నవీపేట్:**



మండలంలో గల బినోల గ్రామ శివారు గుట్ట ప్రాంతంలో పుర్రె, ఎముకలు, దవడ ఎముకలు లభించినట్లు గురువారం ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పోతంగల్ గ్రామానికి చెందిన షేక్ పాషా బినోల శివారు అటవీ ప్రాంతంలో పుర్రె, ఎముకలు, దవడ ఎముకలతో పాటు కొంత దూరంలో డ్రాయర్ పడి ఉన్నాయన గాంధీనగర్ కు చెందిన పంచాయతీ కారోబార్ చింతల మురళి కి సమాచారం అందించడంతో అతను కొంతమంది గ్రామస్తులు తీసుకొని ఘటన స్థలానికి వెళ్లి చూడగా నిజంగానే పుర్రె, ఎముకలు ఉండటంతో పుర్రె ఎముకలు మగ వ్యక్తివా ఆడ వ్యక్తివా తెలియకపోవడంతో పోతంగల్ కారోబార్ చింతల మురళి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఇట్టి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

## ఈనెల 15 నుండి ఒంటిపూట బడులు

**సూర్య వేల్పూర్:**

వేసవికాలం ప్రారంభమైన దృష్ట్యా ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ఒంటి పూటబడులు ఈనెల 15 నుంచి ప్రారంభమవుతుందని మండల విద్యాధికారి సరళ రాని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి పాఠశాలలు ప్రారంభమవుతాయని అన్నారు. ఇట్టి నియమ నిబంధనలను అన్ని పాఠశాలలు పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో తాగునీరు సౌకర్యాన్ని ఎల్లవేళలా పర్యవేక్షణ చేస్తూ ఉండాలని తెలిపారు.

## యువత చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

**సూర్య- ఐక్కనూర్**

విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడలలో రాణించాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి చెప్పారు. గుర ువారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన టిపిఎల్ క్రికెట్ లీగ్ పోటీల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో చైతన్యం తీసుకువచ్చేందుకు క్రీడా పోటీలు నిర్వహించిన ఆర్గనైజింగ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, విడిసి అధ్యక్షుడు సిద్ధిరాములు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధర్మయ్య క్రీడాకారులు పాల్గొన్నారు